క్లుప్తంగా

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: విద్యుత్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధం కాగా రూ.50 వేలు ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరం శివారు నక్కలపుంతలో ముత్తాబత్తుల అర్జునరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుంది. ఆదివారం రాత్రి వీచిన గాలులకు తాటాకింటిపై నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తాకి నిప్పురవ్వలు ఎగిసిపడడంతో తాటాకిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


చెల్లుబోయిన శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని మోరిపోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీలో ఎంతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్త శ్రీను మరణం తనను కలచివేసిందని రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీను ఆకస్మిక మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి ఆయన వెల్లడించారు. శ్రీను మృతి పార్టీకి తీరనిలోటు అని కూడా ఆయన తెలిపారు.

శ్రీనివాసరావు పార్థివదేహానికి నివాళులు

మోరిపోడులోని వైఎస్సార్ సీపీ కార్యకర్త చెల్లుబోయిన శ్రీనివాసరావు పార్థివ దేహానికి ఇంటి వద్ద రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు సోమవారం నివాళులర్పించారు. వెంట మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పలు విభాగాల నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ అచ్యుత రామదాసు

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాజోలుకు చెందిన ప్రముఖ వైద్యులు కొమ్ముల అచ్చుత రామదాసు కోరారు. స్థానిక జెడ్పీహెచ్ స్కూల్లో రూ.60 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ దాత, పూర్వ విద్యార్థి దివంగత యెరుబండి సత్యవర్ధనరావు జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించారు.హెచ్ఎం బి.చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన సభలో దాత సత్యవర్ధనరావు స్కూల్ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. హెచ్ఎం సీహెచ్ నిరంజని, రిటైర్డ్ హెచ్ఎం మైలవరపు రవీంద్రనాథ్, యెరుబండి జగదీష్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్వేదికర గ్రామ కమిటీ ఎంపిక


నూతన గ్రామ కమిటీ సభ్యులతో నాయకులు

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎంపిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు సూచనలతో పార్టీ గ్రీవెన్స్ సెల్ ప్రతినిధి దొంగ నాగసత్యనారాయణ పర్యవేక్షణలో ఈ ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బీర వెంకటరావు(బాబులు), ప్రధాన కార్యదర్శులుగా పాటి జవహర్‌లాల్, దాసరి సత్యనారాయణ, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. న్యాయవాది బెల్లం కొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

రాజోలు: వివేకానంద మనోవికాస కేంద్రం దివ్యాంగులకు దిండి గ్రామానికి చెందిన లలిత అప్పారావు, ఇంజేటి శ్యాంబాబు సోమవారం నిత్యావసర సరకులు అందజేశారు. ఇంజేటి శామ్యూల్ రాజు ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని కుటుంబ సభ్యులు నిత్యావసర వస్తువులు, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. దివ్యాంగులకు సహకారం అందించిన శామ్యూల్ రాజు కుటుంబ సభ్యులను సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. ఏఐవైఎఫ్ కన్వీనర్ వై.వెంకట్, మనోవికాస కేంద్రం డైరెక్టర్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

మామిడికుదురు: మండలంలో పెదపట్నం, గోగన్నమఠం గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిని సోమవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.వీరబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సీహెచ్ స్వామి రెడ్డి, హెచ్‌సీ జేఏఎస్ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకం.. లాభదాయకం

- జాతుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం
- గ్రామీణ ప్రాంతాలకు ఎంతో అనుకూలం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం


పొడగట్లపల్లిలో పెంచుతున్న నాటుకోళ్లు

రావులపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం ఒకప్పుడు రైతుల జీవనశైలిలో భాగంగా వుండేది. కానీ మారిన పరిస్థితుల్లో కోళ్ల పెంపకం పౌల్ట్రీ ఫారాలకే పరిమితమైంది. నాటుకోళ్ల నుంచి గుడ్లు, మాంసం దిగుబడి తక్కువగా వుండటం వల్ల, వీటి పెంపకం రానురానూ కనుమరుగై బాయిలర్, ఫౌల్ట్రీ కోళ్లు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయంలో పాడి పరిశ్రమ తర్వాత స్థానం నాటుకోళ్ల పెంపకానిదే. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందంటున్నారు పశు వైద్యాధికారులు.

ఇంటి పరిసరాల్లోనే..

దేశవాళీ కోళ్లకు గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం తొలకరి పలకరించిన తరుణంలో కోళ్ల పెంపకం మంచిది. గడ్డి, పురుగులు, వర్షానికి వచ్చే విత్తనాలు ఈ సీజన్‌లో కోళ్లకు మంచి ఆహారం. పెద్దగా పెట్టుబడి లేని నాటుకోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతు మహిళలు, కూలీలు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ వ్యర్థాలను మేతగా వేస్తే సరిపోతుంది. నాటుకోళ్లు తినడంతో పౌష్టికాహారం, పోషకాలు కూడా అధికంగా లభిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. ఆరుబయట తిరుగుతూ పెరగడం వల్ల కోళ్ల మాంసంలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. వీటి మాంసం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. కనీసం పెట్టుబడితో స్వల్ప కాలంలోనే లాభాలు గడించవచ్చు.

జాతి ఎంపిక ముఖ్యం

కరోనా కాలంలో కోడి మాంసం, గుడ్లు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్న ప్రచారం జరగడంతో ప్రధానంగా నాటు కోడి మాంసం విక్రయాలు పెరిగాయి. స్టెరాయిడ్ ఇంజక్షన్లు, దాణాతో 40 రోజుల్లో మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న బ్రాయిలర్ కోడిమాంసం తినడానికి ఇష్టపడని మాంసం ప్రియులు, నాటుకోళ్లను కొనడానికి పోటీ పడుతున్నారు. మార్కెట్‌లో గిరిరాజా, వనరాజా, కోళ్లతో పాటు పందెం కోళ్లను పెంచుతున్నా.. నాటు కోళ్లను కొని తినడానికే ఇష్టపడుతున్నారు. అవకాశం ఉన్న ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రాల్లో నాటుకోళ్లను పెంచుతున్నారు. ఈ కోళ్లను ఎంపిక చేసుకున్నప్పుడు అన్ని రకాల టీకాలు వేయించారో? లేదో? వాకబు చేయాలి. ఐదారు వారాల కోడిపిల్లకు అవసరమైన మందులు వేస్తే ఎలాంటి రోగాలు దరిచేరవు. ఈ మధ్య వచ్చిన కడక్‌నాథ్ కోళ్లలో అధిక శాతం ప్రొటీన్, ఐరన్ ఉంటున్నాయి. అలాగే తక్కువ కొవ్వు ఉండటం, ఎక్కువ గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకత.

పెంపకంలో మెళకువలు

గ్రామీణులు 10 నుంచి 30 కోళ్లను ఆరుబయట పెంచుకోవచ్చు. సహజమైన మేత పెడితే సరిపోతుంది. ఆరువారాల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వెదురుకర్రలు, చెక్కలు వంటి స్థానికంగా లభించే వ్యర్థాలతో వీటికి వసతి ఏర్పాటు చేసుకోవచ్చు. 4-8 వారాల్లోపు పిల్లలకు ఒక చదరపు అడుగు, 8-12 వారాల్లోపు వాటికి రెండు చదరపు అడుగుల స్థలం కేటాయిస్తే సరిపోతుంది. కోళ్లు విసర్జించే వ్యర్థాల నుంచి ఏర్పడే తేమను పీల్చుకోవడానికి, చల్లదనం కోసం రంపపు పొట్టును లిట్టర్‌గా వాడుకోవాలి. 5-10 సెంటీమీటర్ల మందంగా పొట్టును పరచి తరచూ సర్దుకోవాలి.

నాణ్యమైన ఆహారం



కోడి పిల్లలకు 28 రోజుల వయసు వచ్చే వరకు దాణా అందించడం శ్రేయస్కరం. ఈ దాణా స్థానికంగా లభించే వ్యర్థాలతో తయారు చేసుకుంటే ఖర్చు ఉండదు. ముఖ్యంగా మొక్కజొన్న రవ్వ, పిల్లలు పెరిగే కొద్దీ నీటి తొట్టెలు, మేత తొట్టెల సంఖ్య కూడా పెంచుకోవాలి. ఈ రకం కోళ్లకు న్యూకాజిల్, ఫౌల్‌ఫాక్స్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వీటి నివారణకు 8-9 వారాల పిల్లలకు టీకాలు వేయించాలి. ఈ రకం కోళ్లు 42 రోజుల వయసులో 650-750 గ్రాముల వరకు పెరుగుతాయి. పెట్టలను గుడ్ల ఉత్పత్తి కోసం వేరుచేయాలి. 10-20 కోళ్ల గుంపులో ఒకటి నుంచి రెండు పుంజులు ఉండేలా చూసుకోవాలి. ఆరుబయట ఉండడం వలన పరాన్నజీవుల సమస్య వచ్చే అవకాశం ఉన్నందున రెండు, మూడు నెలల మధ్య నట్టల నివారణ మందులు వాడాలి.

– ఎం.రామారావు, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్, వానపల్లి

మోసకారి చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

- పి.గన్నవరం నియోజవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం


పొట్టిలంకలో రచ్చబండ నిర్వహిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అంతా తెలుసుకున్న ఆ ప్రజలే బుద్ధి చెబుతారని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పొట్టిలంక, కొండుకుదురు, క్రాప, శంకరాయగూడెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తమకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు వచ్చేవని, పిల్లలకు తల్లికి వదనం వంటి పథకాల వలంటరీ చేతుల మీదుగా నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవని ఇప్పుడు ఏవీ అందడంలేదని దుయ్యబట్టారు. పనులు మానుకుని రేషన్ షాపుల వద్ద పడిగాపులు పొడాల్సివస్తోందన్నారు. అలాగే సూపర్ సిక్స్ పేరిట ప్రవేశ పెట్టిన పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు, మహిళలకు నెలకు రూ.1500 పథకం అమలు కావడం లేదన్నారు. అర్హత ఉన్న ఒక్క ఇంటి రుణం కూడా ఇవ్వలేదన్నారు. తమకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సర్వే పేరుతో తీయించేశారన్నారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైనే ఉందన్నారు. ఎన్నికల్లో గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేస్తామని ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. ఆయన పాలన ఒక స్వర్ణ యుగమన్నారు. బాబూ మోసపూరిత హామీలను ప్రజలు ఒక సంవత్సర పాలనలోనే పసి గట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుల విత్తనాల ఇంద్రశేఖర్, యన్నబత్తుల ఆనంద్, కొమ్ముల రాము, పార్టీ నాయకులు బూడిద వరలక్ష్మీ, కడలి భూపతిరావు, కుడుపూడి రామకృష్ణ, కుడుపూడి విద్యాసాగర్, దొమ్మేటి వెంకటేశ్వరరావు, జోగి రామకృష్ణ, గెడ్డ ఏసుబాబు, మెల్లం ప్రసాద్, కనుమూరి సత్యనారాయణ, కుసుమ రమణ, చేట్ల రామారావు తదితరులు ఉన్నారు.

మురుగునీరు పోయే మార్గం లేక ముంపు

- 500 ఎకరాల పంట భూములకు నష్టం
- ఆత్రేయపురం జెడ్పీటీసీ సాయిబాబు ఆందోళన
- మండల సమావేశంలో సమస్యల ఏకరువు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అన్నపూర్ణ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి నుంచి డ్రైనేజ్ నీరు కిందికి పోయే మార్గం లేక అధిక వర్షాలకు ఆ పరసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, దీనివల్ల రైతులు పంటలు కోల్పోతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు, పలువురు సభ్యులు వివిధ సమస్యలు ప్రస్తావించారు. జెడ్పీటీసీ సాయిబాబు మాట్లాడుతూ లొల్ల సమీపంలో డ్రైన్ నీరు పోవడానికి ప్రధాన కాలువ కింది నుంచి తూరలు వేశారని, వాటి ద్వారా ర్యాలి వరకూ డ్రైన్ నీరు చేరగా అక్కడి నుంచి బయటకు వెళ్లడానికి మార్గం లేక భారీ వర్షాలు కురిసినప్పుడు సుమారు 500 ఎకరాల పంట ముంపునకు గురవుతుందన్నారు. ఆ పరిస్థితి తలెత్తక ముందే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆ అధికారి తెలిపారు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రానికి ప్రతిరోజు ముఖ్యంగా శనివారం వేలాదిగా భక్తులు తరలివస్తున్నారని, ప్రధానమైన బొబ్బర్లంక-వెలిచేరు రోడ్డు అధ్వానంగా మారడంతో అనేక మంది భక్తులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లన్నీ ఆధునీకరించామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి పాలకులు ఈ సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వెంటనే రోడ్లు బాగుజేయాలని కోరారు. అనంతరం ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను తెలియజేశారు. తర్వాత ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో అభివృద్ధిని తెలియజేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పెనుమత్స బంగారురాజు, ఎంపీడీఓ బీకేఎస్ఎస్‌వీ రామన్, తహసీల్దార్ టీ రాజరాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు చిలువూరి బాబిరాజు, బాబు, పీఎస్ఆర్ జైపాల్, పాల చిన వెంకటరమణ, కేతా ఏడుకొండలు, సర్పంచ్‌లు పాల నాగేశ్వరరావు, గాదిరాజు ప్రసాదరాజు, గడ్డం సుధా, రాజు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో కూటమి పరువు పోగొట్టుకుంది

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: సుమారు 45 ఏళ్ల నిజాయితీతో కూడుకున్న రాజకీయ అనుభవం గల పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి కుటుంబంపై బురదజల్లి కూటమి ప్రభుత్వం పరువు పోగొట్టుకుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. సోమవారం మలికిపురం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిధున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయనకు పార్టీతో పాటు ప్రజల అండ ఉన్నారని, పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకుని ప్రజలను డైవర్ట్ చేసే పనిలో భాగంగానే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని అన్నారు. అరెస్టులతో పార్టీ కేడర్‌ను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేద్దామని కూటమి నేతలు కుట్ర పన్నారన్నారు. ఆ కుట్రలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. మిధున్‌రెడ్డి తన నిజాయితీని కోర్టులోనే నిరూపించుకుని కడిగిన ముత్యంగా బయటకు వస్తారని సూర్యారావు అన్నారు. గ్రామాలలో కార్యాకర్తలు అంతా ధైర్యంగా ఉండాలని, ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుర్రం జాషువా, కుసుమ చంద్రశేఖర్, మోకా సురేష్, తాడి సహదేవ్, జిల్లెళ్ళ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నాం : కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు



మామిడికుదురు: చంద్రబాబు కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అతన్ని అరెస్టు చేశారని పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మిథున్ రెడ్డి అరెస్టు కూటమి అరాచక పాలనకు పరాకాష్టగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతుంది సుపరిపాలన కాదని అరాచక పాలన అని ఎద్దేవా చేశారు. అధికారం ఉంది కదా అని లేని లిక్కర్ కేసును సృష్టించి వైఎస్సార్ సీపీ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికించి, వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమన్నారు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి ఏదో ఒక విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న వారిపై తప్పుడు కేసులు బనాయించి వేధించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ అనేది వట్టి అభూత కల్పన అని, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలహీన పరచి, నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ కుట్రలకు తెర తీశారని శ్రీనివాసరావు తీవ్రంగా మండిపడ్డారు.

అక్రమ కేసులు తప్ప అభివృద్ధి శూన్యం

సఖినేటిపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టడం తప్ప, అభివృద్ధి శూన్యమని ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ అన్నారు. సోమవారం ఉయ్యూరువారి మెరకలో ఆయన మాట్లాడుతూ, ఎంపీ మిథున్‌రెడ్డిని ఏవిధమైన ఆధారాలు లేకుండా కుట్ర పూరితంగా అరెస్టు చేశారని ఆరోపించారు. తమ నాయకులపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

అక్రమ కేసులతో వేధిస్తున్నారు


మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి

మామిడికుదురు: కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ నేతలను వేధిస్తోందని ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఏడాది పాలనలో అక్రమ కేసులు బనాయించడం తప్ప ప్రభుత్వం సాధించింది లేమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏడాది గడిపేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయకుండా మోసం చేశారన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ దశల వారీగా నిరసనలు చేస్తోందన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. అతను కడిగిన ముత్యంలా బయటకు వస్తారని రాజేశ్వరీదేవి చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, అక్కమ కేసులకు స్వస్తి పలికి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

‘మత్తు’ జోలికి పోవొద్దు


అంబాజీపేటలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, ఉత్తమ భవిత కోసం మందడుగు వేయాలని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎస్సై కె.చిరంజీవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు లోనై బతుకులను పాడుచేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించిన, వాటిని విక్రయించిన నేరమేనన్నారు. ప్రస్తుతం యువత పెడదోవ పడుతున్నారని మత్తు పదార్థాలకు బానిసై వారి భవిష్యత్‌ను అంధాకారంలోకి నెట్టేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగరాజు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాకలిపాలెంలో సత్య సాయి సేవలు


శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న ఈఎన్టీ నిపుణుడు డాక్టర్ ప్రభాకర్

పి.గన్నవరం: అమలాపురం సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో చాకలిపాలెంలో సోమవారం పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు జరిగాయి. సత్య సాయి గ్రామ సేవలో భాగంగా ఆ గ్రామంలో సత్య సాయి రథ యాత్ర, పల్లకీ ఊరేగింపు, నగర సంకీర్తన వంటి ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయిసేవా సమతి అమలాపురం డివిజన్ కో ఆర్డినేటర్, డాక్టర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. ఈఎన్టీ, దంత వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. 8 మంది గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. బాల వికాస్ పిల్లలకు పలు ఆధ్యాత్మిక, సామాజిక అంశాల్లో పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. చివరగా సేవా సమితి డివిజన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ సత్య సాయి బాబా చెప్పిన మార్గ దర్శకాలైన పలు నీతి వ్యాఖ్యలను పిల్లలకు వివరించారు. పి.గన్నవరం మండల, చాకలిపాలెం గ్రామ సత్య సాయి సేవా సమతి ప్రతినిధులు, గ్రామస్తులు ఈ సేవా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

ఆలమూరు: మండలంలోని చింతలూరు, పెనికేరు గ్రామాల్లోని సొసైటీలకు సంబంధించి సోమవారం త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం జరిగింది. చింతలూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)కి జనసేన పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌గా నల్లా వెంకటేశ్వరరావు, సభ్యులుగా బుంగ చిన్నబ్బులు, కడలి రమేష్ నియమితులయ్యారు. పెనికేరులోని శ్రీగొడవర్తి వెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) అధ్యక్షుడిగా మేకా రామన్న, సభ్యులుగా సలాది గోవిందరాజు, వాసంశెట్టి రమణ నియమితులయ్యారు. ఆయా సొసైటీల పరిధిలో అధికారులు త్రిసభ్య కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణపై సర్వే

రాజోలు: కీటక జనిత వ్యాధుల నియంత్రణపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్టు జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన రాజోలు సబ్‌యూనిట్ పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులను నియంత్రించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దోమల లార్వాలను నాశనం చేసేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. జ్వరపీడితులను గుర్తించి వారి రక్తనమూనాలు సేకరించి ఎప్పటికప్పుడు సంబంధిత పీహెచ్‌సీ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి వై.ఆదినారాయణ, సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్, సీహెచ్‌ఓ కె.సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

స్థలం వినియోగంలోకి తీసుకురావాలి

కొత్తపేట: స్థానిక మార్కెట్ వీధిలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆ ప్రాంతం నివాసితులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ పీ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. మార్కెట్‌లోని మసీదు సమీపంలో ఒక వ్యక్తికి చెందిన సుమారు 11 సెంట్ల స్థలం గత 25 సంవత్సరాలుగా ఖాళీగా ఉందని, స్థలం నిరుపయోగంగా ఉండడంతో పాములు, కీటకాలు సంచరిస్తున్నాయని, ఇతర ప్రాంతాల వారు చెత్తా చెదారం, వ్యర్థాలు తీసుకువచ్చి ఆ స్థలంలో పాడేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీనివల్ల చుట్టూ నివాసం ఉంటున్న తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని, ప్రజలకు ప్రయోజనం కలిగేలా అభివృద్ధి చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం, మహిళల హాల్, ఆరోగ్య కేంద్రం, చిన్న పాటిపార్కు, లేదా పేద వారికి నివేశన స్థలాలు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.25,116 విరాళం అందజేత చేశారు. ఆలమూరుకు చెందిన శ్రీమహాలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యం ప్రతినిధులు వెత్సా సత్తిబాబు, వెత్సా శంకరం, వెత్సా నానాజీ, వెత్సా రవి సంయుక్తంగా సోమవారం దేవదాయశాఖ అధికారులకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న రాజగోపురాల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల నిమిత్తం ఈవిరాళాన్ని వినియోగించాలని దాతలు విజ్ఞప్తి చేశారు. గన్ని వెంకట్రావు (చిన్నబ్బు), గన్ని సూరిబాబు, వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో దండోరా కమిటీలు

మలికిపురం: ప్రతి గ్రామంలో దండోరా వేసి సమావేశం ఏర్పాటు చేసి గ్రామ శాఖల విభాగ కార్యవర్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్ణయించింది. సోమవారం మండలంలోని గూడపల్లి మరియు పల్లిపాలెం గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. దండోరా ఉద్యమం ఇప్పటివరకు సాధించిన విజయాలను వివరించారు. ఆగస్టు 24వ తారీఖున జిల్లాకు వచ్చే పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొనే సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు ముస్కుడి బాలాజీ మాదిగ ,ఉల్లంపర్తి ప్రేమ్ కుమార్ మాదిగ. గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

పీఎంపీకి సత్కారం

పి.గన్నవరం: పెదకందాలపాలెంలో 30 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీ పీవీవీ సత్యనారాయణ (అబ్బు)ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువకులు, పెద్దలు, మహిళలు అబ్బుకు బంగారు ఉంగరాన్ని, నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు సీహెచ్.చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు కె.రవికుమార్, పి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ జైనుల్ అబెదీన్‌కు ఘన నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు నాలుగో ఇమామ్ జైనుల్ అబెదీన్‌కు ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. దీనిలో భాగంగా మామిడికుదురు, మొగలికుదురు, నగరం గ్రామాల్లో ప్రత్యేక మజ్లిస్‌లు నిర్వహించారు. అనంతరం గుమ్మాటాన్ని తీసి గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. భక్తులు కన్నీటి పరంతమయ్యారు. పంజా నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంచారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

అయినవిల్లి: మండలంలో కె.జగన్నాథపురం, తొత్తరమూడి ప్రభుత్వ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుత్తుల మీరాకుమార్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. గుత్తుల మీరాకుమార్, రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ కడలి ఈశ్వరి చేతుల మీదుగా సుమారుగా 250 మందికి స్కూల్ బ్యాగ్‌లను అందించారు. కార్యక్రమంలో నాయకులు మద్దాల ఫణీ, గుత్తుల బాబి, చిట్టూరి విజయ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.